క్లుప్తంగా

నిబంధనల ప్రకారం పింఛన్ల పంపిణీ



ఏపీత్రయంలో ఇంటి వద్ద పింఛన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో సామాజిక భద్రత పింఛన్లను నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తున్నారని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. ఆమె బుధవారం ఏపీత్రయం, పెదపూడి గ్రామాల్లో ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తంగా 10,702 సామాజిక పింఛన్లు ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి రూ.3,08,56,000 నగదు మంజూరైందన్నారు. దాంట్లో 2,846 మందికి ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మిగిలిన 7,856 మందికి పింఛన్ల నగదును బ్యాంకులో జమ చేశారన్నారు. ఇంటి వద్ద ఇచ్చే పింఛన్లకు సంబంధించి సుమారు 62 శాతం మేర పంపిణీ పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



రామేశ్వరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

పెదపూడి: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల విధులకు గాని, ఎన్నికల ప్రక్రియకు గాని ఎవరైనా భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన పెదపూడి మండలంలోని శహపురం, రామేశ్వరం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. అక్కడ సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించాలని కోరారు. ఓటర్లు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శోభన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో హోం ఓటింగ్

పెదపూడి: మండలంలో 82 మంది హోం ఓటింగ్ ఉపయోగించుకోనున్నారని తహసీల్దార్, ఏఆర్ఓ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. గురువారం ఎవరైనా హోమ్ ఓటింగ్ వేయలేకపోతే వారికి మళ్లీ 8వ తేదీన హోమ్ ఓటింగ్ నిర్వహిస్తారన్నారు.

ఆలయ భూమి కౌలు హక్కులకు బహిరంగ వేలం

సీతానగరం: పురుషోత్తపట్నం రెవెన్యూ పరిధిలోని ఆలయ భూమిని కౌలు హక్కులకు బహిరంగ వేలం నిర్వహించినట్టు రంగంపేట మండలం వడిశలేరు శ్రీభజే నారాయణ స్వామి ఆలయ ఈఓ పి.ప్రియాంక బుధవారం తెలిపారు. పురుషోత్తపట్నం గ్రామ సచివాలయంలో షీల్డ్ టెండర్లతోపాటుగా బహిరంగ వేలం నిర్వహించారు. వడిశలేరులో నారాయణ స్వామి ఆలయానికి సంబంధించి 6.19 ఎకరాల పంట భూమిని రూ 2.68 లక్షలకు చొప్పున మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలంలో నల్లూరి హరిబాబు కైవసం చేసుకున్నారు. దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయ ఈఓ లక్ష్మి కుమార్ పర్యవేక్షణలో ఈ వేలం నిర్వహించినట్టు ఈఓ ప్రియాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ గుమస్తా హనుమంతురావు, 40 మంది రైతులు పాల్గొన్నారు.

ముంపునకు మోక్షం

- రివర్స్ ఎత్తిపోతల పథకం!
- రూ 91.10 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితం
- ముంపు నుంచి బయటపడనున్న 25 వేల ఎకరాలు

సీతానగరం: ఇప్పటి వరకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించడం చూశాం. కానీ రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అద్భుతమైన ఆలోచనతో రివర్స్ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం వల్ల ముంపునకు గురవుతున్న పంట పొలాలతో రైతుల నష్టపోతున్న విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఉంచి రూ 91.10 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్లు దశలో ఉన్న రివర్స్ ఎత్తిపోతల పథకంతో పలు మండలాల్లోని 25 వేల ఎకరాల పంట పొలాలు ముంపు బారి నుంచి బయటపడనున్నాయి.

తొర్రిగడ్డ కాలువలో కలిసే విధానం

పలు మండలాల నుంచి వర్షం నీరు బురద కాలువ, కూనవరం డ్రైన్ నుంచి తొర్రిగడ్డ కాలువలో కలిసి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళ్తుంది. గండేపల్లి, రాజానగరం నుంచి వచ్చే నీరు దోసకాయల పల్లి దోసకాలయలపల్లి జగ్గప్ప చెరువులో కలిసి, బూరుగుపూడి వద్ద అయ్యన్నగల్లు నుంచి బురదకాలువ ద్వారా తొర్రిగడ్డ కాలువలోకి వస్తుంది. అలాగే గంగవరం మండలం నుంచి శ్రీరంగపట్నం మీదుగా కాపవరం నుంచి గుమ్ములూరులో కలిసి తొర్రిగడ్డ కాలువలోకి వస్తుంది. కోరుకొండ నుంచి జంభూపట్నం బలరామయ్య చెరువు నుంచి అయ్యన్నగల్లులో కలుస్తుంది. రంపచోడవరం మండలం నుంచి వచ్చే నీరు దేవీపట్నం మీదుగా రాపాక నుంచి కూనవరం డ్రైన్ ద్వారా ఉండేశ్వరపురంలోని తొర్రిగడ్డ కాలువలో కలిచి బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి తరలివెళ్లుతుంది.

ముంపునకు కారణం ఇదే..

దేవీపట్నం, రంపచోడవరం, కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలలో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన మిగులు జలాల నీరు బురదకాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. దీనిని కొండ గోదావరి అని అంటారు. అదే సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటిమట్టం పెరిగితే బొబ్బిల్లంకలోని స్లూయిస్ తలుపులు అటోమేటిక్‌గా మూసుకుపోతాయి. తగ్గితే గేట్లు తెరచుకుని కొండగోదావరి నీరు స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళ్లుతుంది. గోదావరి వరద సమయంలో వరద నీట్టి మట్టం ఎక్కువగా ఉంటే స్లూయిజ్ గేట్లు మూసుకుపోవడంతో కొండ గోదావరి ఎగపోటుతో నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలు పంట నీట మునిగి రైతులు నష్టపోతున్నారు.



బొబ్బిల్లంకలో తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నెలకొల్పే ప్రదేశం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పంటపొలాలు ముంపు బారిన పడకుండా మంచి ఆలోచన చేశారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగడ్డ కాలువపై రివర్స్ ఎత్తిపోతల పథకం నిర్మించి, గోదావరి వరద సమయంలో కొండగోదావరి నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తే పంటపొలాలు ముంపు నుంచి రక్షించవచ్చని ఆలోచనకు జీవం పోశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఉంచి ఎత్తిపోతల పథకంకు రూ 91.10 కోట్లు రాబట్టారు. దీనితో సీతానగరం మండలం కూనవరం, రాపాక, చినకొండేపూడి, పెదకొండేపూడి, రఘుదేవపురం, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక గ్రామాలు కోరుకొండ మండలంలో జగన్నాథపురం, గుమ్ములూరు, కాపవరం, బూరుగుపూడి, మునగాల గ్రామాల 25 వేల ఎకరాల పంటపొలాలు ముంపు నుంచి బయటపడనున్నాయి.

రైతులకు పెద్ద మేలు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు ఎంతో మేలు చేశారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నెలకొల్పి కొండ గోదావరి నీటిని ఎత్తిపోస్తే ఎప్పటికి పంట పొలాలు ముంపు బారిన పడవు. ఇప్పటి వరకు ఏ నాయకుడు చేయని పని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేశారు. సీతానగరం, కోరుకొండ మండలాల పంట పొలాల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– వలవల వెంకట్రాజు, మండల ఆర్బీకె చైర్మన్, సీతానగరం

అద్భుతమైన పథకం



బొబ్బిల్లంక వద్ద తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సంబంధించి టెండర్లు దశలో ఉంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో రూ 91.10 కోట్లు మంజూరవడం హర్షణీయం. కొండ గోదావరి ఎగపోటుతో రైతుల పంటపొలాలు ముంపులోకి వెళ్లుతున్నాయి. దీనివల్ల 25 వేల ఎకరాలు పంటపొలాలు ముంపు నుంచి బయటపడనున్నాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు రుణపడి ఉంటాం

–పెందుర్తి దేవదాసు, మాజీ ఎంపిపి, సీతానగరం

జగనన్నతోనే పేదలందరికీ న్యాయం



వెంకటాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే పేదలందరికీ న్యాయం జరుగుతుందని సర్పంచ్ ముంగి గంగరాజు అన్నారు. బుధవారం ఆయన వెంకటాపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, పంచాయితీరాజ్ జిల్లా అధ్యక్షుడు మంగిన రాంబాబు, ఎంపీటీసీ నురుకుర్తి సత్తిబాబు, స్కూల్ చైర్మన్ ముంగి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ అంచూరి శ్రీను, పార్టీ ఉపాధ్యక్షుడు అంచూరి ఏసుబాబు పాల్గొన్నారు.

కూటమిని తరిమేందుకు ఓటర్లు సిద్ధం



రాజంపేటలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు హారతి ఇస్తున్న మహిళలు

- జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్రంలో ప్రతిపక్ష గుంపును తరిమికొట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని, మళ్లీ జగనన్నే సీఎం అని ప్రజలు అంటున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించడానికి సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన 650 హామీలు ఎప్పుడూ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఇప్పుడు చంద్రబాబు విడుదల చేసిన తాజా మేనిఫెస్టోను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి ఏమి జరగలేదని, దోచుకోవడమే లక్ష్యంగా పాలన చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలతోపాటుగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదలకు ఆర్థిక పుష్టి కలిగించార న్నారు. సీఎం జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గం ప్రజలకు అందుబాటు ఉండడంతో పాటు, తల్లి జక్కంపూడి విజయలక్ష్మి, తమ్ముడు జక్కంపూడి గణేష్, భార్య డాక్టర్ రాజశ్రీతోపాటుగా తమ్ముడు గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి ప్రజలకు సేవలందిస్తామన్నారు. సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్నన, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ మద్దిపాటి దీప, ఎంపీటీసీలు నూతంగి ధనలక్ష్మి, తాడేపల్లి వెంకట్రావు, ఉపసర్పంచ్ కోన రామకృష్ణ, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, మాజీ ఎంపీపీ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కానవరంలో రాజశ్రీ ప్రచారం

కానవరంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నీ దొంగ హామీలు ఎవరూ నమ్మరు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



చీపురుపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: చంద్రబాబు నాయుడు దొంగ హామీలను ఎవరు నమ్మరని, ఫ్యాన్ స్పీడ్‌కు కూడమి సభ్యులు కనిపించకుండా పోతారని వైఎస్సార్ సీపీ రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం మండలంలోని చినకొండేపూడి, చీపురుపల్లి, అచ్చయ్యపాలెంలలో వైఎస్సార్ సీపీలో పలువురు చేరారు. జక్కంపూడి రాజా సమక్షంలో చినకొండేపూడిలో నేలపాటి గౌరీశంకర్, ఆకాశపు రమేష్, బంటుమిల్లి సన్నీ, కుక్కల విజయ సాగర్, తలారి వీర్రాజు, యాళ్ల కిరణ్, నేలపాటి రమేష్, నేలపాటి శ్రీరామ్‌లతోపాటుగా 30 మందికి వారి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చీపురుపల్లిలో సత్తేబత్తుల నాని, సత్తేబత్తుల చినసముద్రం, పెద్దె ప్రసాద్, పెద్దె రాజులతోపాటుగా 20 మంది, అచ్చయ్యపాలెంలో పేరుబోని రాముడు, సంసాని నాగేష్, మునసబులతోపాటుగా 25 మంది పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న కొలది వైఎస్సార్ సీపీలోకి వలసల పర్వం కొనసాగుతుందని, రానున్న ఎన్నికలోల వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, వైస్ ఎంపీపీ ముదునూరి సురేష్‌రాజు, మాజీ ఎంపిపి పెందుర్తి దేవదాసు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కోండ్రపు ముత్యాలు, సత్తిపండురాజు, చల్లమళ్ళ సుజీరాజు, పోలినాటి ఈశ్వరుడు, మద్దాల కొండలరాజు, పత్తి వెంకటేష్, నేలపాటి అశోక్, గోపిశెట్టి తులసీరామ్, గోపిశెట్టి అచ్చారావు, దోసపాటి వీరచంద్రం, మన్నెల్లి వెంకట్రావు పాల్గొన్నారు

ఫ్యాను గుర్తుకు ఓటేస్తే ఇంటి ముంగిటకే సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొప్పవరం, దుప్పలపూడిల్లో ఎన్నికల ప్రచారం



కొప్పవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు మీ ఇంటి ముంగిటకే రావాలంటే ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొప్పవరం, దుప్పలపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, కాపు నేస్తం, నేతన్న నేస్తం, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, ఈబీసీ నేస్తం, కల్యాణమస్తు, వైఎస్సార్ బీమా, చేదోడు, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, జగనన్న తోడు తదితర సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. స్వార్థ ప్రయోజనాలు టీడీపీ నేతల నైజమని, పూటకో పార్టీతో జత కట్టడం పచ్చ పార్టీ అధినేతలకు అలవాటేనన్నారు. కూటమి నేతల మాటలు నమ్మి మోసపోరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ కుటుంబంలో మేలు జరిగితేనే నాకు ఓటు వెయ్యండని ధైర్యంగా చెప్పగలిగే సత్తా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అండగా నిలవాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కొప్పవరం, దుప్పలపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరికీ గ్రామస్తులు అడుగడుగునా మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తాడి వెంకటరామకృష్ణారెడ్డి, తాడి సూరారెడ్డి, మల్లిడి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, దుప్పలపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి సతీష్, ఎంపీటీసీ కొండా ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



దుప్పలపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అభివృద్ధిలో రాజానగరం ముందంజ

- రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్



కనుపూరు సమావేశంలో స్థానిక నాయకులతో చందన నాగేశ్వర్

మధురపూడి: అభివృద్ధిలో రాజానగరం ముందంజలో ఉందని, ఎమ్మెల్యే రాజా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బుధవారం కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆహ్వానం మేరకు గ్రామంలోని 200 మంది పద్మశాలీలు, దేవాంగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజానగరం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంతో పాటు, అభివృద్ధి నిమిత్తం రూ.1,770 కోట్లు ఖర్చుచేశారన్నారు. జగనన్న మేనిఫెస్టోలో ఉన్న అన్ని హామీలను నెరవేర్చుతారన్నారు. కూటమి అభ్యర్థులు చెప్పిన కల్లబొల్లు మేనిఫెస్టో, కాపీ మేనిఫెస్టోను నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంల తుది విడత ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ చేస్తున్న దృశ్యం

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల తుది విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో బుధవారం నిర్వహించామని రిటర్నింగ్ అధికారి ఎ. చైత్రవర్షిణి తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివిపాట్స్ ఓటర్ రెండో, తుది విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 259 బ్యాలెట్ యూనిట్లు, 259 కంట్రోల్ యూనిట్లు, 30 శాతం అదనంగా కలిపి 280 వివిప్యాట్స్‌లు కేటాయించామన్నారు.

పారదర్శకంగా పోలింగ్ యంత్రాల ర్యాండమైజేషన్

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు కేటాయించే పోలింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు. అనపర్తి నియోజకవర్గ పరిధిలోని 228 పోలింగ్ కేంద్రాలకు గాను అదనంగా ఇచ్చిన 20 శాతం పోలింగ్ యంత్రాలతో కలిపి మొత్తం 273 బ్యాలెట్ యూనిట్లు, 273 కంట్రోల్ యూనిట్లతో పాటు అదనంగా 30 శాతం వీవీ ప్యాట్‌లతో కలిపి మొత్తం 296 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎన్నికల విధులు సిబ్బంది, నియజకవర్గ పరిశీలకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తుది విడత పోలింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపూడి: మండలంలోని పెదపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కాకినాడ విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జి.మామిడాడ, రాజుపాలెం, పైన, వేండ్ర, గండ్రేడు, పెద్దాడ, కైకవోలు, కుమారప్రియం, బిక్కవోలు మండలంలోని మెళ్లూరు, ఆరికరేవుల తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



పెదపూడి ఎంపీడీవో కార్యాలయం వద్ద మేడే జెండాను ఆవిష్కరించిన రాజేశ్వరి తదితరులు



బూరుగుపూడిలో పునీత జోజప్ప తేరుతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్‌సీఎం క్రైస్తవులు

పెదపూడి: దేశాభివృద్ధిలో కార్మికులది కీలక పాత్రని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పెదపూడి గ్రామ శివారు కైకవోలు సెంటర్‌లో ఏపీఆర్‌సీఎస్ జెండాను ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా కార్యదర్శి బి.రమేష్, స్త్రీవిముక్తి రాష్ట్ర నాయకురాలు బి.గంగ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ, ఏపీ కార్యదర్శులు మల్సూర్, సుధాకర్, మడికి సత్యం తదితరులు పాల్గొన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద మేడే జెండాను సీఐటీయూ జిల్లా నాయకురాలు ఎం.రాజేశ్వరి ఆవిష్కరించారు.

రంగంపేట: మండలంలోని సింగంపల్లి గ్రామంలోని సీపీరెడ్డి నగర్‌లో 138వ మేడే వేడుకలు ఏపీఆర్‌సీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి రాష్ట్ర నాయకుడు బి.గంగా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ కార్యదర్శి మల్సూర్, ఏపీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: క్రైస్తవుల ఆరాధ్యదైవం యేసుక్రీస్తు సాకుడుతండ్రి, పునీత కార్మిక జోజప్ప శ్రామికవర్గానికి ఆదర్శనీయమని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో జరిగిన శ్రామిక దినోత్సవంలో మనోజ్‌కుమార్ మాట్లాడారు. తొలుత బూరుగుపూడి మెయిన్‌రోడ్డులోని చర్చి నుంచి ప్రదర్శన నిర్వహించారు.

రాజానగరం: కార్మికుల హక్కుల పరిరక్షణకు అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామపురంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో ప్రకాష్‌బాబు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టిఎస్ కార్తీక్, ఆటో యూనియన్ సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మే డే సందర్భంగా రాజానగరంలో సీపీఐఎల్ న్యూడెమొక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు రాజానగరంలో కార్మిక పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1978–1983 మధ్య చదువుకున్న విద్యార్థులంతా బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల గౌరవ అధ్యక్షుడు ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పేద విద్యార్థులను ఆదుకోవడానికి, పాఠశాల అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని చెప్పారు. ఇక నుంచి ప్రతి రెండేళ్లకు ఓసారి ఆత్మీయ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కర్రి సుబ్బిరెడ్డి, ఊబా జోషి, పినిపే వెంకటరమణ, జాన్ క్రిస్టఫర్, చౌదరి, అంజనీ వెంకటరెడ్డి, కోటిరెడ్డి, వెలగల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.